సాక్షి ఖమ్మం

సోమవారం । 11 । మార్చి । 2024



ఖమ్మం.. ఎంతో హాట్ గురూ..

జిల్లాలో సాధారణానికి మించి 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా, రాష్ట్రంలోనే ఇది అత్యధికం. 8లో



... దొంగల ముఠా అరెస్ట్

అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కల్లూరు పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు పెరిగి, మధ్యాహ్నానికి అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షకు 380 మంది



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ పొందేందుకు నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 380 మంది అభ్యర్థులు హాజరయ్యారని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, స్టడీ సర్కిల్ సెక్రటరీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఉచిత శిక్షణ కోసం 539 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 380 మంది మాత్రమే హాజరయ్యారని, 159 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలు త్వరలో వెల్లడిస్తామని, మెరిట్ ఆధారంగా 100 మందిని శిక్షణకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 17 వరకు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టడీసర్కిల్ డైరెక్టర్ సీహెచ్ వీరభద్రం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీరుల్లా, పరీక్ష కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, ఎన్.ప్రియాంక, డీవీఎల్ఎన్ జయశ్రీ, ఎ.లిఖిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని అన్నమయ్య జిల్లాకు చెందిన రాటకొండ శ్రీలత, విజయవాడకు చెందిన పంగా అనంతరామయ్య ఆదివారం వేర్వేరుగా రూ.50,116 చొప్పున విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉప ప్రధానార్చకులు విజయదేవశర్మకు చెక్కులు అందించగా.. వారు స్వామివారి శేషవస్త్రాలను బహూకరించారు.

గణపేశ్వరాలయం ఆదాయం రూ.9.59 లక్షలు



కూసుమంచి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

కూసుమంచి: మహా శివరాత్రి సందర్భంగా కూసుమంచిలోని శివాలయానికి(గణపేశ్వరాలయం) రూ.9.59 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ కాముని శ్రీకాంత్ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత ఆధ్వర్యంలో ఆదివారం ఆలయంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుండీల ద్వారా రూ.3,35,796, టికెట్ల విక్రయం, దుకాణాల వేలం, కల్యాణ కట్నాల ద్వారా రూ.6,24,041 ఆదాయం సమకూరిందని చెప్పారు. గతేడాది కంటే ఆదాయం స్వల్పంగా తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పునరుజ్జీవకర్త సాధు వీరప్రతాప్ రెడ్డి, అడహక్ కమిటీ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, సభ్యులు నెల్లూరి జ్యోతి, కందుల వీరబాబు, హలావత్ రెడ్యానాయక్, గుండా భూపాల్‌రెడ్డి, చెన్ను రవి, తంగెళ్ల చంద్రయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీకి నీలాద్రి ఆదాయం రూ.9.42 లక్షలు

సత్తుపల్లిటౌన్: మహా శివరాత్రి సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి నీలాద్రికి రెండు రోజుల పాటు బస్సులు తిప్పడం ద్వారా రూ.9.42 లక్షల ఆదాయం లభించిందని డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. 8,245 కిలోమీటర్ల మేర బస్సులు నడిపామని, కిలో మీటర్‌కు రూ.114.3 ఈపీకేతో పాటు ఓఆర్ 176 సాధించామని చెప్పారు. మొత్తం 308 ట్రిప్పుల్లో 21,372 మంది ప్రయాణికులను చేరవేసినట్లు వివరించారు. ఇందులో మహాలక్ష్మి ప్రయాణికులు 12,799 మంది, ఇతరులు 8,573 మంది ఉన్నారని, గతేడాది కంటే రూ.3 లక్షలు అధికంగా ఆదాయం వచ్చిందని తెలిపారు.

మూడోరోజూ కొనసాగిన జాతర


ఖమ్మంరూరల్: మండల పరిధిలోని తీర్థాలలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న జాతరలో మూడో రోజైన ఆదివారం కూడా భక్తుల సందడి కొనసాగింది. సంగమేశ్వరస్వామి వారిని పలువురు దర్శించుకున్నారు.

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత భద్రాచలంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదు. పైగా గత ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు అమలుకు నోచుకోలేదు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నేడు భద్రాచలం ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియాన్ని ప్రస్తుత అవసరాలకు తగినట్లు పునర్నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మిథిలా పునర్నిర్మిస్తే..

పర్వదినాల్లో అందరికీ రామయ్య దర్శనం

- ముక్కోటి, నవమిలకు భక్త జనసంద్రంగా భద్రాద్రి
- మిథిలా స్టేడియంలో స్పష్టంగా కనిపించని కల్యాణవేదిక
- వీవీఐపీ, వీఐపీల గ్యాలరీల భక్తులకే కనుల విందు
- అరకొరగానే సామాన్య భక్తులకు రామయ్య దర్శనం



యాంఫీ థియేటర్ నమూనా

పర్వదినాల్లో లక్షకు మించి భక్తుల రాక

లక్ష్మణ సమేత సీతారాములు కొలువై ఉన్న భద్రాచలం క్షేత్రానికి పండగలు, సెలవు రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి పర్వదినాల్లో లక్షకు పైగా చిలుకు భక్తులు భద్రాచల క్షేత్రానికి వస్తారు. దీంతో సీతారాముల కల్యాణం, ఉత్తర ద్వారంలో దేవేరులను దర్శించుకోవాలన్నా మిథిలా స్టేడియం, దాని చుట్టూ ఉన్న ప్రాంగణం కీలకం. స్టేడియంతోపాటు పరిసర ప్రదేశాలను సెక్టార్లుగా విభజిస్తారు. దాదాపు నలభై ఏళ్ల కిందట అప్పటి అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిన ప్రణాళిక నమూనానే కొంచెం అటు ఇటుగా ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రస్తుత అవసరాలను ఈ ఏర్పాట్లు తీర్చలేకపోతున్నాయి. కల్యాణ మంటపం ఎత్తు, ఉత్తర ద్వారం, మిథిలా స్టేడియంలోని గ్యాలరీల మధ్య పొంతన లేదు. దీంతో ముక్కోటి, శ్రీరామ నవమి పర్వదినాల్లో వీవీఐపీ, వీఐపీ సెక్టార్లలో ఉన్న వారికి తప్పితే మిగిలిన సెక్టార్లలో ఉన్న భక్తులకు కనులారా సీతారాములను దర్శించుకోవడం సాధ్యం కావడం లేదు. ఎక్కడెక్కడి నుంచో వ్యయప్రయాసలకు ఓర్చి భద్రాచలం చేరుకున్న భక్తులకు సీతారాములను తనివితీరా దర్శించుకోవడం దుర్లభంగా మారింది.

పొగడ చెట్టు నీడన మొదలై

శ్రీరామదాసు కాలంలో భద్రాచల ఆలయ ప్రాంగణంలో ఉన్న పొగడ చెట్టు నీడలో సీతారాముల కల్యాణం నిర్వహించేవారని ఆలయ పండితులు చెబుతుంటారు. ఆ తర్వాత కాలంలో భక్తుల సంఖ్య పెరగడంతో పొగడ చెట్టు నుంచి చిత్రకూట మండపంలోకి పెళ్లి వేదికను మార్చారు. గోదావరిపై వంతెన నిర్మాణం పూర్తయ్యాక భద్రాచలం వచ్చే భక్తుల సంఖ్య వేలల్లోకి చేరుకుంది. చిత్రకూట మండపంలో అంతమందికి పెళ్లి చూడటం కష్టం కావడంతో ఆలయ ప్రాంగణం నుంచి బయట కల్యాణం జరిపించాలని నిర్ణయించారు. దీంతో ఉత్తర ద్వారానికి ఎదురుగా నవమి కల్యాణం కోసం ప్రత్యేకంగా మండపాన్ని 1964లో నిర్మించారు. సుమారు రెండు దశాబ్దాల పాటు ఎత్తైన కల్యాణ మండటంతో పెళ్లి తంతు జరుగుతుండగా చుట్టూరా భక్తులు చేరి చూసేవారు.

మిథిలా స్టేడియం

గోదావరిపై వంతెన అందుబాటులోకి రావడం, రవాణా సౌకర్యాలు మెరుగవడంతో నవమి కల్యాణానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1988లో కల్యాణ మండపం చుట్టూ భక్తులు కూర్చుని చూసేందుకు వీలుగా గ్యాలరీని నిర్మించారు. అప్పటి నుంచి కల్యాణ వేడుకలు జరిగే ప్రదేశాన్ని మిథిలా స్టేడియంగా పిలుస్తున్నారు. ఆ తర్వాత స్టేడియంలో గ్యాలరీపై ఎండా, వాన పడకుండా షెడ్డు నిర్మించారు. అయితే ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మిథిలా స్టేడియం సేవలు అందివ్వలేకపోతోంది. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో స్థల లభ్యత కొరత ఏర్పడింది. దీంతో ఉన్న స్థలంలోనే ఇటు శ్రీరామనవమి, అటు ముక్కోటితో పాటు ఇతర పర్వ దినాల్లో వచ్చే భక్తులకు అందుబాటులో ఉన్న స్థలంలోనే ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది.

యాంఫీ థియేటర్ తరహాలో..

భద్రాచలానికి భక్తులు ఎక్కువగా వచ్చే శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి పండుగలను దృష్టిలో పెట్టుకుని మిథిలా స్టేడియంలో మార్పులు చేయాలని లేదా పునర్ నిర్మాణం చేయాలని భక్తులు కోరుతున్నారు. ఉత్తర ద్వారం, నవమి కల్యాణ వేదిక, భక్తుల గ్యాలరీల మధ్య సమతుల్యం ఉండేలా మిథిలా స్టేడియాన్ని యాంఫీ థియేటర్ తరహాలో నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కొత్తగా యాంఫీ థియేటర్ లేదా ఓపెన్ ఎయిర్ థియేటర్ తరహాలో మిథిలా స్టేడియాన్ని నిర్మిస్తే గ్యాలరీల దిగువ భాగన వచ్చే స్థలంలో భజన మందిరం, భక్తుల వసతి, డార్మిటరీ, క్లోక్‌రూం వంటి ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు ఆస్కారం ఏర్పడుతుందని సూచిస్తున్నారు.

జిల్లాది ఘనమైన చరిత్ర

- ఖమ్మం అభివృద్ధికి ఎంతో మంది కృషి చేశారు
- సాగర్ నీటి సరఫరాతో జిల్లా అన్ని రంగాల్లో పురోగమించింది
- మాజీ సీజేఐ ఎన్.వి.రమణ



ఎన్.వి.రమణ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం జిల్లా అంటే చైతన్యం కలిగిందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, ఈ జిల్లాది ఘనమైన చరిత్ర అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణమండపంలో కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన ఎన్.వి.రమణ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రమణ, శివమాల దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు జిల్లాలో కోర్టు భవనాలు నిర్మించాలని ప్రతిపాదించానని, అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయని, భారతదేశంలో న్యాయవ్యవస్థకు అంతగా ప్రాధాన్యత లేదనడానికి ఇదొక నిదర్శనమని ఎన్.వి.రమణ అన్నారు. పదవిలో, అధికారంలో ఉన్న సమయంలో సన్మానాలు, సత్కారాలు సహజమని, తాను ఉద్యోగ విరమణ పొందిన ఏడాదిన్నర తర్వాత కూడా సన్మానం చేయడం హర్షణీయమంటూ ఆయన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అనేక మంది తన మిత్రులు, సహచరులు స్థిరపడ్డారని, ఈ ప్రాంతానికి తన స్వగ్రామం చాలా దగ్గరగా ఉంటుందని అన్నారు. చీఫ్ జస్టిస్‌గా ఉన్న సమయంలో తాను ఈ జిల్లా నుంచి ముగ్గురిని హైకోర్టు జడ్జిలుగా నియమించానని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, గ్రంథాల్లో జిల్లాకు అనేక పేర్లు ఉన్నాయని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య రాసిన వీరతెలంగాణ విప్లవ పోరాటం పుస్తకం చదివితే ఈ ప్రాంతంలో సంచరించినట్లు, సాయుధ పోరాట అనుభవాలు, కథలు కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జలగం వెంగళరావు, శీలం సిద్ధారెడ్డి, కమ్యూనిస్టు నేతలు బోడెపూడి వెంకటేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, రజబ్ అలీ, చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, మంచికంటి రామకిషన్‌రావు తదితర నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. తుమ్మల నాగేశ్వరరావు కూడా జిల్లా అభివృద్ధికి పని చేసిన మంచి నాయకుడని అన్నారు. సమాజంలో అసమానతలు పెరిగితే సంపద, అధికారాన్ని అనుభవించలేమని చెప్పారు. నాగార్జునసాగర్ నీరు వచ్చిన తర్వాత ఈ ప్రాంతం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందిందని, మరింతగా అభివృద్ధి చెందేందుకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వారికి గౌరవం తెచ్చిన వ్యక్తి ఎన్.వి.రమణ అన్నారు. ఆల్మట్టి ప్రాజెక్టు అక్రమంగా నిర్మిస్తున్న సమయంలో ముగ్గురు ముఖ్యమంత్రులతో కమిటీ వేయించారని, డ్యామ్ ఎత్తు పెంచకుండా అడ్డుకున్నారని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ నామ నాగేశ్వరరావు సమ్మేళనానికి హాజరుకాలేకపోయామని, ఎన్.వి.రమణ పట్ల తమకున్న గౌరవాన్ని తెలియజేస్తూ సందేశాన్ని పంపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీడీపీ బాధ్యులు వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ బాధ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, సీపీఎం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి యర్రా శ్రీకాంత్, పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవులు అనధికార శాసనకర్తలు

'లావా' పుస్తకావిష్కరణలో మాస్‌లైన్ నేత పోటు రంగారావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, నాయకులు

ఖమ్మంగాంధీచౌక్: కవులు అనధికార శాసనకర్తలని, ప్రజల ఆలోచనలకు దిక్సూచి వంటివారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకుడు పోటు రంగారావు అన్నారు. కవి, రచయిత యలగందుల దేవయ్య రచించిన 'లావా' వచన కవిత్వం పుస్తకాన్ని స్థానిక ఐఎంఏ హాల్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ చైతన్యం కోసం మేధావులు తమవంతు బాధ్యత పోషించాలన్నారు. దేవయ్య రచనలు సమాజంలో జరుగుతున్న అకృతాలను నిలువరించేలా బాధ్యతలను గుర్తు చేశాయని తెలిపారు. ప్రధానంగా పేదలు, మహిళలపై జరుగుతున్న దాడులపై దేవయ్య తన కవిత్వంలో విశదీకరించారని అన్నారు. గుర్రం జాషువా సాహిత్య సంస్థ అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మధ్య తరగతి వర్గానికి చెందిన దేవయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కవిగా ఎదిగారని అభినందించారు. వ్యవస్థలోని లోపాలను, స్త్రీలు, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులను తన కవిత్వం ద్వారా ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో అపసవ్య ధోరణలను సరిచేయడానికి దేవయ్య లాంటి ప్రగతిశీల భావాలు కలిగిన ఉపాధ్యాయులు రావాలన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం మొదటి ప్రతిని కవి దేవయ్య తన కూతురు వైవీఎస్ పవిత్రకు అందజేశారు. వేడగాని శేషగిరి, కన్నెగంటి వెంకటయ్య 'లావా' కవిత్వాన్ని గానాలాపన చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు రాయల చంద్రశేఖర్, ఇబ్రహీం, నిర్గుణ్, రాణాప్రతాప్ పాల్గొన్నారు.

రామయ్య సాక్షిగా ఐదో హామీ

మంత్రి పొంగులేటి వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

భద్రాచలం : భద్రాచలం సీతారామచంద్రస్వామి సాక్షిగా సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ ప్రభుత్వ ఐదో హామీ 'ఇందిరమ్మ ఇండ్లు' పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో జరుగుతున్న సీఎం పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం కార్యక్రమంలో ఆరు హామీలను పేర్కొనగా, ఇప్పటికే నాలుగు హామీలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చామని తెలిపారు. ఐదో హామీని భద్రాద్రి రామయ్య సన్నిధిలో నేడు సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ పథకంలో తొలి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను పేదలకు మంజూరు చేస్తామన్నారు. గ్రామసభల ద్వారా అర్హులను గుర్తిస్తామని, మొదట విడతలో ఇళ్ల స్థలం ఉన్నవారికి, రెండో విడతలో ఇళ్ల స్థలం లేని వారికి పథకం వర్తింపజేస్తామని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఇళ్లను మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో, జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, ఏజెన్సీలో ఉన్న వారికి సైతం అందజేస్తామని పేర్కొన్నారు. తొలుత గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, కలెక్టర్ ప్రియాంక ఆల పూల మొక్కలను ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క తదితరులు

చింతకాని/ముదిగొండ/బోనకల్ : జనాభాలో సగభాగమైన మహిళలు కూడా చిన్న చిన్న పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆదివారం ఆయన చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోనూ రోడ్లు నిర్మించి రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందన్నారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు నుంచి పాతర్లపాడు వరకు రూ.7 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, రాఘవాపురం – లచ్చగూడెం, రాఘవాపురం – అల్లీపురం వరకు వరకు రూ. 8 కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మిస్తామని ప్రకటించారు. అనంతరం ముదిగొండ మండలం ముత్తారం, వనంవారికిష్టాపురం గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బోనకల్ మండలం గోవిందాపురం నుంచి మోటమర్రి వరకు రూ.4.80 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, ఆళ్లపాడు నుంచి కేఎల్‌రావ్ రోడ్డు వరకు రూ.4 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుతో పాటు కలకోట నుంచి నారాయణపురం, ఆళ్లపాడు నుంచి నారాయణపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వి.పి.గౌతమ్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ మధుసూదన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రమౌళి, ఖమ్మం ఆర్డీఓ గణేష్, డీఈ కోటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఎంపీపీలు కంకణాల సౌభాగ్యం, కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ రమేష్, వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీలు శ్రీదేవి, దమ్మాలపాటి సరస్వతి, పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు జావీద్, నాయకులు గాలి దుర్గారావు, పైడిపల్లి కిశోర్, కర్నాటి కోటి, భాగం శ్రీనివాసరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పాపారావు, అంబటి వెంకటేశ్వర్లు, కూరపాటి కిషోర్, తుపాకుల యలగొండస్వామి, రమేష్, మందరపు నాగేశ్వరరావు, పసునులేటి దేవేంద్రం, దమ్మాలపాటి మార్క్స్, కందిమళ్ల వీరబాబు, ఆదినారాయణరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి స్వర మాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి కళాభిమానులను అలరించింది. యూనిట్ అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తమ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు గాయనీ, గాయకులు టి. నిర్మల, కుమారి నాగార్జున, పావని, ఆదిరాజు పురుషోత్తం, ఆకుల గణపతి రాజు, ఎం. ఇజ్రాయిల్, ఎ.పున్నయ్య, ప్రకాష్, ఎస్‌కే ఇమామ్, కె.సుధాకర్ రావు, ఎం.ఆదినారాయణ తదితరులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన తెలుగు సినిమా పాటలను పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

వర్సిటీ వచ్చేనా?

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కలగానే యూనివ్సరిటీ ఏర్పాటు
- పీజీ, పీహెచ్‌డీలకు ఓయూ, కేయూలకు వెళ్లలేకపోతున్న విద్యార్థులు
- నలభై ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పాలకులు
- నేడు భద్రాద్రిలో పర్యటించనున్న సీఎం స్పందిస్తారని ఆశాభావం



ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద కళాశాలగా పేరున్న ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కాలేజీ

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు కలగానే మిగులుతోంది. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు అర్హతలు, అవకాశాలు ఉన్నా.. నాలుగు దశాబ్దాలుగా పోరు సాగుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎం స్పందిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

వైఎస్ హయాంలో ప్రతిపాదనలు..

యూనివర్సిటీ లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించలేకపోతున్నారు. పీజీ, పీహెచ్‌డీ చేయాలంటే ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు వెళ్లాలి. దీంతో అనేకమంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరికొందరు దూరవిద్యావిధానం వైపు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటుకు 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రతిపాదన పెట్టారు. ఆ తర్వాత ఆ యూనివర్సిటీని ఆదిలాబాద్‌కు తరలించారు. దీంతో విద్యార్థులకు నిరాశే ఎదురైంది. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో కూడా ఏర్పాటు కాలేదు. ఇక గిరిజన యూనివర్సిటీ ములుగులో ఏర్పాటు చేశారు. ఇక్కడ యూనివర్సిటీ ఆవశ్యకతపై ఎవరూ పట్టించుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళనలు

యూనివర్సిటీ కోసం విద్యార్థి సంఘాలు 40 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నాయి. దీంతో ఖమ్మంలో యూనివర్సిటీ సబ్ క్యాంపస్‌ను మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా ఇప్పటివరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉండగా, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కలపాలని ప్రయత్నాలు చేశారు. ఇందుకు నిరసనగా విద్యార్థి సంఘాలు ఉద్యమించడంతో ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి. కాగా యూనివర్సిటీ ఏర్పాటుకు పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు.

అర్హతలు, అవకాశాలు ఉన్నా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన వసతులు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు, కళాశాలలు, విద్యార్థులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు లక్ష మంది వరకు ఉమ్మడి జిల్లాలో విద్యనభ్యసిస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ ఏర్పాటుకు 200లోపు కళాశాలలు ఉండాలి. కాగా ఉమ్మడి జిల్లాలో 146 డిగ్రీ, 9 పీజీ, 4 బీఈడీ, డైట్, లా కళాశాల ఒక్కోటి చొప్పున ఉన్నాయి. అతిపెద్ద కళాశాలగా ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్‌కు గుర్తింపు ఉంది. సుమారు 5 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. మరోవైపు జిల్లాలో వందల ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు లాభదాయకంగా ఉంటుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుంది.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రాలు సమర్పించారు. కాగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి యూనివర్సిటీ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా కూడా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. పలుమార్లు ఆందోళనలు చేపట్టినా, అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా యూనివర్సిటీ మంజూరు చేయాలి.

–వంగూరి వెంకటేష్, పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలి



ఖమ్మం కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. తక్షణమే వర్సిటీ ఏర్పాటుకు జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలి. అనేక మంది ముఖ్యమంత్రులు సైతం యూనివర్సిటీ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించినా ఆచరణలోకి రాలేదు.

–ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

నీరు చోరీ చేయకుండా కాల్వ గట్లపై పహారా



అమ్మగూడెం సమీపంలో గస్తీ కాస్తున్న పోలీసులు, ఇరిగేషన్ సిబ్బంది

నేలకొండపల్లి: ఖమ్మం నగర ప్రజలకు తాగు నీటి కోసం సాగర్ జలాలను విడుదల చేయటంతో వాటిని చోరీ చేయకుండా పోలీసులు, ఇరిగేషన్ అధికారులు గస్తీ కాస్తున్నారు. సాగర్ జలాలను పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మానికి సాగర్ కెనాల్ ద్వారా సరఫరా చేస్తున్నారు. కాగా, మండలంలోని రాజేశ్వరపురం వద్ద నున్న నందిగామ బ్రాంచ్ కెనాల్ లాక్‌ల సమీపంలో పోలీసులు, ఇరిగేషన్ సిబ్బంది రాత్రింబవళ్లు పహారా కాస్తున్నారు. రాత్రి నేలకొండపల్లి ఎస్ఐ నాగరాజు సిబ్బందితో కాలువ కట్టపై పెట్రోలింగ్ నిర్వహించారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి: కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత బహిరంగ వేలం సోమవారం ఉదయం 11 గంటలకు సంత ఆవరణంలో నిర్వహించనున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసా చట్టం ప్రకారం పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని, వేలంలో పాల్గొనే వారు కుల ధ్రువీకరణ పత్రం, ధరావత్ నగదు రూ.30 లక్షలు, సాల్వెన్సీ కింద రూ.5 లక్షలను డీడీ లేదా నగదు రూపేణా చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనే పాటాదారుడు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయి ఉండొద్దన్నారు.

పండితాపురంలో 144 సెక్షన్

పండితాపురం సంత బహిరంగ వేలం దృష్ట్యా గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సంత ఆవరణలోకి కేవలం వేలం పాటాదారులు మాత్రమే హాజరుకావాలని, ఇతరులు ఎవరూ రావొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంఘటితంగా ఉంటేనే బలోపేతం



మాట్లాడుతున్న హకీమ్

ఖమ్మంసహకారనగర్ : అందరం సంఘటితంగా ఉంటేనే సంఘం బలోపేతం అవుతుందని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీమ్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల హక్కుల సాధనకు ఉద్యమాలు చేపట్టి అనేక జీవోలు తీసుకొచ్చామని తెలిపారు. సర్వీస్‌లో ఉన్న, ఉద్యోగ విరమణ పొందిన డ్రైవర్ల ఇళ్లలో జరిగే శుభ కార్యాలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ.2,116కు పెంచుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.హరినాథ్ బాబు, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్‌కే.ఖాజా, ముఖ్య సలహాదారులు ఎస్‌కే.నయీమ్, ఎం.బాబూరావు, గౌరిరాజు రాములు, జి.విద్యాసాగర్, తేజావత్ పంతులు, కే.సుబ్బేశ్వరరావు పాల్గొన్నారు.

ఖమ్మం.. ఎంతో హాట్ గురూ..

- ఉష్ణోగ్రతల్లో జిల్లా టాప్
- సాధారణానికి మించి 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు
- గుబ్బగుర్తిలో అత్యధికంగా 39.2 డిగ్రీలు
- పనులు, పరీక్షల కాలంలో ఇబ్బందులు



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ రోడ్

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలో కెల్లా ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేస్తోంది. సాధారణానికి మించి 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. మార్చి మొదటి, రెండో వారంలో జిల్లాలో సగటు ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావాల్సి ఉండగా మరో 5 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది 35 నుంచి 39 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి ఆరంభం నుంచి ఉష్ణోగ్రతల ప్రభావం మొదలవగా ప్రస్తుతం మరింతగా పెరిగింది. ఆదివారం కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో అత్యధికంగా 39.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి ఆరంభం నుంచి రోజురోజుకూ ఉష్ణోగ్రతల ప్రభావం పెరుగుతోంది. ఇదిలా ఉండగా మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం జిల్లాలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి ఆరంభం నుంచి కూడా రాష్ట్రంలో ఖమ్మం జిల్లానే టాప్‌లో నిలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతలు రానున్న రోజుల్లో మరింతగా పెరుగుతాయని వాతావరణ శాఖ పేర్కొంటోంది.

ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు

ఉదయం 8 గంటల నుంచే ఉష్ణోగ్రతల ప్రభావం ప్రారంభమవుతోంది. 11 గంటల వరకు ఎండ తీవ్రత పెరుగుతోంది. ఇక మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 4 గంటల వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయింత్రం 4 గంటల నుంచి కొంత తీవ్రత తగ్గుతోంది. ఉదయం, సాయంత్రం వేళలతో పోలిస్తే మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయట తక్కువగా కనిపిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రం రహదారులు రద్దీగా ఉంటున్నాయి. వ్యాపార సంస్థలు కూడా మధ్యాహ్నంతో పోలిస్తే ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటున్నాయి. ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోతలు పెరుగుతున్నాయి. పిల్లలకు, వృద్ధులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

పెరిగిన విద్యుత్ వినియోగం

ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. గత ఏడాది మార్చి రెండో వారంలో ప్రతి రోజూ జిల్లాలో 7.40 నుంచి 7.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగగా, ఈ ఏడాది 7.70 నుంచి 7.75 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. గతేడాదితో పోలిస్తే నిత్యం 35 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను అదనంగా వినియోగిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే పంటల సాగు ఈ ఏడాది తక్కువగా ఉంది. అయినప్పటికీ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంది. అంటే ఉష్ణోగ్రతలు పెరగటమే ఇందుకు కారణమని విద్యుత్ శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగటంతో గృహ విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్ల వినియోగం పెరిగింది. ఇక ప్రాజెక్టుల్లో నీరు లేకపోవటం, భూగర్భ జలాలు బాగా అడుగంటడంతో పంటలకు విద్యుత్ వినియోగం పెరిగింది.

ప్రస్తుతం పలు రకాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగి వ్యవసాయ పనులతో పాటు, వివిధ రకాల వ్యవసాయేతర పనులు కూడా సాగుతున్నాయి. జిల్లాలో మిర్చి కోతలు, ఆరబెట్టడం, విక్రయాలు వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక అక్కడక్కడా సాగు చేసిన వరి పనులు కూడా జోరందుకున్నాయి. పలు ప్రాంతాల్లో మామిడి తోటలు, ఇతర ఉద్యాన తోటల పనులు సాగుతున్నాయి. ఎండ తీవ్రత ఉండటంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఖమ్మం వ్యవసాయ మార్కెట్లలో మిర్చి క్రయ, విక్రయాలు, కాంటాలు, తోలకాల పనుల్లో, ఘాటు, ఎండ తీవ్రతతో కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక టెన్త్, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు ప్రస్తుతం పరీక్షల కాలం. ఎండలో స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లి రావటం, ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు వెళ్లి రావడానికి ఎండతో ఇబ్బంది పడుతున్నారు.

ఆదివారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
గుబ్బగుర్తి(కొణిజర్ల)	39.2	28.1	ఎర్రుపాలెం	36.4	27.9
రఘునాథపాలెం	37.2	28.8	ఖానాపురం(ఖమ్మం)	36.3	30.0
గేటు కారేపల్లి	37.2	30.7	గంగారం(సత్తుపల్లి)	36.2	30.1
కూసుమంచి	37.1	29.1	పెనుబల్లి	35.9	30.3
వైరా	37.0	29.5	ఏన్కూరు	35.8	30.0
బచ్చోడు (తిరుమలాయపాలెం)	37.0	29.0	వేంసూరు	35.6	29.2
రావినూతల(బోనకల్)	36.9	28.3	నేలకొండపల్లి	35.3	28.5
సిరిపురం(మధిర)	36.7	28.0	కల్లూరు	35.3	29.3
నాగులవంచ(చింతకాని)	36.6	28.0	లింగాల(కామేపల్లి)	35.2	28.2
తల్లాడ	36.5	28.4	పమ్మి(ముదిగొండ)	35.0	28.8
			పల్లెగూడెం(ఖమ్మంరూరల్)	35.0	28.4

నేడు 'బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్'

సైన్స్ మ్యూజియంలో విద్యార్థుల కోసం ప్రదర్శన

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ) ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని ఎకో క్లబ్‌లు కలిగిన పాఠశాలల విద్యార్థులు మాత్రమే పాల్గొనేలా సోమవారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. 'బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్' పేరిట నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 161 ఎకోక్లబ్‌లు కలిగి ఉండగా.. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు మాత్రమే ఇందులో పాల్గొనే అవకాశముంది.

నూతన ఆలోచనల వైపు..

పాఠశాల స్థాయిలో విద్యార్థులను నూతన ఆలోచనల వైపు మళ్లించేలా పలు పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటుచేశారు. జిల్లాలోని 161 పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయగా అందులోని 8, 9వ తరగతుల విద్యార్థుల కోసం ఈ నెల 11న(నేడు) బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని జిల్లా సైన్స్ మ్యూజియం (పాత డీఈఓ కార్యాలయం)లో జరిగే ఈ ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ సందర్భంగా ఉపయోగం లేని వస్తువులతో రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తారు. అట్టలు, ప్లాస్టిక్ బాటిళ్లు, సీసాలు, మూతలు, కొబ్బరిబొండాలు, చిప్పలు తదితర వస్తువులతో విద్యార్థులు ఇప్పటికే ఎగ్జిబిట్లను రూపొందించారు. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన ముగ్గురికి వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందించనున్నారు. కాగా, ప్రదర్శనలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులకు చార్జీగా రూ.100 చొప్పున చెల్లించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి డి.జగదీశ్వర్ తెలిపారు.

రేపు 'వందేభారత్' ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం : సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం (20707) మధ్య రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని సీసీఐ ఎండీ జాఫర్ తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఉదయం 9 : 25 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 : 24 గంటలకు ఖమ్మం చేరుతుందని తెలిపారు. తిరిగి విశాఖపట్నం నుంచి(20708) మధ్యాహ్నం 14:35 గంటలకు బయలుదేరి రాత్రి 20 : 03 గంటలకు ఖమ్మం చేరుతుందని వివరించారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో లెటర్ రైటింగ్ పోటీలు



లెటర్ రైటింగ్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ లెటర్ రైటింగ్ కాంపిటిషన్ ఫర్ యంగ్ పీపుల్–2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ ఏర్పడి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భవిష్యత్ ప్రపంచం ఏవిధంగా ఉండాలని కోరుకుంటున్నారనే అంశంపై వివిధ స్థాయిల్లో పాఠశాల విద్యార్థులకు లెటర్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలతో పాటు జిల్లా నలుమూలలకు చెందిన పాఠశాలల విద్యార్థులు 205 మంది పాల్గొన్నారు. ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు హైమావతి, విజయలక్ష్మి, సత్యావతి, శిరీష, శ్రీవల్లి, ఆర్‌వీఎస్ఎన్ చార్యులు, భార్గవ్, శ్రీకాంత్, పుల్లారావు, నాయుడు, సురేశ్, కోటేశ్వరరావు, పమ్మి వెంకటేశ్వరరావు, మల్లికార్జున్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. రెండేళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు బహుమతులు సాధించారని, దీంతో పోటీ పెరిగిందని పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

సత్తుపల్లి: మండలంలోని రేజర్ల శివారులోని కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, 9 ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.4,070 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కిరణ్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.7.40 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కల్లూరు: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఎస్ఐ షాకీర్, సిబ్బంది పట్టుకున్నారు. ఏసీపీ రఘు స్థానిక విలేకరులతో వివరాలు వెల్లడించారు. ఖమ్మం సీసీఎస్ ఏసీపీ రవి, ఉన్నతాధికారుల నుంచి అందిన సమాచారంతో పాటు సత్తుపల్లి సీఐ కిరణ్, రూరల్ సీఐ వెంకటేశ్ ఆదేశాల మేరకు కల్లూరు ఎస్ఐ ఎస్‌కే షాకీర్, ఏఎస్ఐ చారి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు కల్లూరు పట్టణ పరిధిలోని తిరువూరు క్రాస్‌రోడ్ వద్ద మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు ఆపకుండా వెళ్తుండగా ఎస్ఐ వెంబడించి పట్టుకుని, అందులోని వారిని విచారించారు. వారిలో సత్తుపల్లికి చెందిన నీలాల అనిల్‌కుమార్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భీమిని రాజ్‌కుమార్ అలియాస్ తిల్లు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన రామ్‌దేవకి రాజ్‌కుమార్, ములకలపల్లి మండలం వేమికుండ గ్రామానికి కారం రాములు ఉన్నారు. నీలాల అనిల్‌కుమార్, రాజ్‌కుమార్ నెలరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 17 చోట్ల దొంగతనాలు చేసినట్లు అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. రామ్‌దేవ్ రాజ్‌కుమార్, కారం రాములు చోరీ చేసిన వస్తువులను విక్రయించడంలో సాయం చేసేవారని చెప్పారు. వారి వద్ద నుంచి 97.02 గ్రాముల బంగారం, 120 గ్రాములు వెండి, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.7.40 లక్షలు ఉంటుందని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ రఘు తెలిపారు. దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్ బృందాన్ని సీపీ సునీల్ దత్ అభినందించారు.

కార్పొరేషన్ ఏర్పాటును విస్మరించిన బీఆర్ఎస్

ఖమ్మంమామిళ్లగూడెం: గత ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటును విస్మరించిందని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేవయ్య, ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ ఆరోపించారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 12న జరిగే కేబినెట్ సమావేశంలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో హైదరాబాద్‌లో సింహగర్జన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పారా నాగేశ్వరరావు, కనిశెట్టి విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, పూర్ణచందర్‌రావు, రవి, బండి సంజీవ్, పారా ఉదయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం పెద్దపీట



స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆర్ఎం సీహెచ్ వెంకన్న అన్నారు. ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో ఆదివారం ఖమ్మం డిపోలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. పీఆర్సీ బాండ్ బకాయిల చెల్లింపునకు అనుమతించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఖమ్మం డీఎం బి.శ్రీనివాస్, సీఐలు రామిశెట్టి రామయ్య, శ్రీనివాసరావు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నకిరేకల్ మండలం మోదిగినగూడెం గ్రామానికి చెందిన వలిశెట్టి మనోజ్‌కుమార్ (30) ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కమిషన్ వ్యాపారి వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. మార్కెట్ సమీపంలోని జమలాపురం కేశవరావు పార్క్ సమీపంలో కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. భార్య శనివారం పుట్టింటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం మార్కెట్‌లో కాటాలు కూడా వేసిన ఆయన సాయంత్రం తర్వాత ఇంట్లో ఉరివేసుకున్నాడు. తాము వచ్చేంత వరకు మృతదేహాన్ని ఉరివేసుకున్న స్థానం నుంచి దించొద్దని, తమకు అనుమానాలు ఉన్నాయని మృతుడి తల్లిదండ్రులు చెప్పడంతో పోలీసులు వారు వచ్చిన తర్వాతనే మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..



రవికుమార్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు కథనం ప్రకారం.. యాతాలకుంటకు చెందిన పడుగు రవికుమార్ (38) కొత్తగా ఇల్లు నిర్మించి అప్పులపాలయ్యాడు. శనివారం రాత్రి పురుగులమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీతిరుపతమ్మ, కుమారులు గురుచరణ్‌తేజ, రేవంత్‌కుమార్ ఉన్నారు. మృతుడి తమ్ముడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి మరొకరు..

ఖమ్మంక్రైం: మానసికస్థితి బాగాలేని ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని బూడిదగడ్డకు చెందిన ఠాకూర్‌విజయ్‌సింగ్ (41) నాలుగేళ్లపాటు ఆర్మీలో పనిచేశాడు. మానసికస్థితి బాగాలేకపోవటంతో ఆర్మీ తిరిగి పంపించింది. ఆదివారం ఉదయం ఖమ్మం వచ్చిన ఆయన రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆధార్ కార్డు ద్వారా రైల్వే పోలీసులు వివరాలు సేకరించి, ఆయన అల్లుడు దినేశ్‌సింగ్‌కు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు బృందం మార్చురీకి తరలించింది. జీఆర్‌పీ ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా వాసులు మృతి



రాజిరెడ్డి




ఎస్‌కే షబ్బీర్

ఖమ్మంరూరల్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ఈగ రాజిరెడ్డి (37), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనుగుర్తికి చెందిన షేక్ షబ్బీర్ (35) కలిసి గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారు. వారం రోజుల కిందట వీరు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఓ గ్రానైట్ క్వారీ నుంచి రాయిని తీసుకుని ఖమ్మం వస్తుండగా మార్గమధ్యలో మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పింది. ఈ క్రమంలో గ్రానైట్ రాళ్లు క్యాబిన్‌పై పడటంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా షబ్బీర్ ఐదేళ్లుగా వరంగల్‌క్రాస్‌రోడ్డులో కుటుంబంతో నివాసముంటున్నాడు. రాజిరెడ్డి ఖమ్మం నగరంలోని సారధినగర్‌వాసి.

68 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తిరుమలాయపాలెం: లారీలో అక్రమంగా తరలిస్తున్న 68 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం టాస్క్‌ఫోర్స్, తిరుమలాయపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన మడికంటి రామయ్య రేషన్ బియ్యాన్ని ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం మీదుగా తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. లారీడ్రైవర్ నర్రా పెద్దులును అదుపులోకి తీసుకున్నారు. మడికంటి రామయ్య, లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ



గాయపడిన ధరావత్ అర్జు

ఖమ్మంరూరల్: ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తీర్థాలలో ఆదివారం జరిగింది. ఖమ్మం రమణగుట్టకు చెందిన ధరావత్ అర్జు తీర్థాల జాతరకు వచ్చాడు. ఈ క్రమంలో మహబూబాబాద్‌కు చెందిన రాజేశ్ అనే వ్యక్తితో ఘర్షణ జరిగింది. అర్జును గాజు పెంకుతో రాజేశ్ పొడవటంతో అక్కడున్న వారు గుర్తించి 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘర్షణకు గల కారణాలు తెలియాల్సి ఉంది.